విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 27,అక్టోబర్ 2023

తప్పులు సరి చేసుకోండి

విశాలాంధ్ర –ఆత్మకూరు రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో ఈ -పంట నమోదు చేసిన రైతుల జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి డి.విష్ణు వర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాలలో ఈ నెల 30 వరకు గ్రామ సభలు నిర్వహించి, ఈపంట నమోదు చేసిన రైతుల వివరాలను సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించారని, కావున రైతులు తమ వివరాలను సరి చూసుకోవాలని తెలిపారు. అభ్యంతరాలుంటే స్థానిక రైతు భరోసా కేంద్రంలో సంప్రదించి ఈనెల 30 లోగా సరి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారులు కోరారు.

టీకేసింగ్ అక్రమాలపై విచారణ చేపట్టాలి

పాణ్యం–విశాలాంధ్ర : మండల పరిధిలోని కౌలూరులో తిరుమలగిరి గ్రీన్‌సిటీ అగ్రశ్రేణి సంస్థ యజమాని బీకేసింగ్ వివిధ సర్వే నెంబర్ల లో పదుల సంఖ్యలో వాగు,ప్రభుత్వ భూములను ఆక్రమించడం జరిగిందని అతని అక్రమాలపై విచారణ చేపట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం నందు గురువారం సీపీఐ నాయకులు ధర్నా చేపట్టి తాహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్‌లు మాట్లాడుతూ కౌలూరు లోని సర్వే నెంబర్ 384,396,412,388 మరియు మరి కొన్ని సర్వే నెంబర్లలో భూములను కొనుగోలు చేసి తిరుమలగిరి గ్రీన్ సిటీ పేరుతో వెంచర్లు వేయడం జరిగిందన్నారు.వాటి పక్కనే ఉన్న సర్వే నంబర్ 400లోని వాగు,ప్రభుత్వ భూమి సుమారు 13 ఎకరాల భూకబ్జా చేసి వాటిలో కూడా వెంచర్లు వేశారని ఆరోపించారు. బి.కె సింగ్ ఆక్రమించిన వాగు,కాల్వ పోరంబోకు ద్వారా వచ్చే వర్షపు నీటితో 200 కుటుంబాలు ఎస్సీ సామాజిక వర్గం నివసిస్తున్న కాలనీ మునిగిపోయే ప్రమాదం ఉందని, కాలనీవాసులు ప్రభుత్వ రెవెన్యూ అధికారులకు ఎన్నోసార్లు విన్నవించిన స్పందించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.జిల్లా సీపీఐ ఆధ్వర్యంలో స్పందనలో ఫిర్యాదు చేయడం జరిగిందని,అయినా ప్రభుత్వ అధికారులు ఆ భూములను ఇంతవరకు పరిశీలించకపోవడం చాలా దౌర్భాగ్యమన్నారు.తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు, మండల రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడి బీకేసింగ్ ఆక్రమించిన భూములపై సర్వే జరిపించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. లేకపోతే సీపీఐ జిల్లా ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు.

కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కో కన్వీనర్ సోమన్న, ఏపీ వ్యకాస కార్మిక సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు సంజీవులు,సిపిఐ జిల్లాసమితి సభ్యులు శ్రీనివాసులు,పట్టణ అధ్యక్షుడు భూమని శ్రీనివాసులు, ఏపీ మహిళా సమితి జిల్లాసహాయ కార్యదర్శి మహేశ్వరమ్మ, సీపీఐ నాయకులుఇమ్రాన్,ఆసిఫ్,ఆటో యూనియన్ నాయకులు ఆనంద్, రాజేష్, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర– పాములపాడు : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ ఖాతాదారులను కోరారు. గురువారం మండల కేంద్రంలో అన్ని సౌకర్యాలతో నూతన బ్యాంకు భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బ్యాంకు మేనేజర్ నాగేంద్రమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ రాకేష్ కశ్యప్, జనల్ మేనేజర్ పిఎస్ నవీన్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాతాదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రూ.లక్ష పంట రుణం పొందే వారికి పూర్తివడ్డీ ఉచితమన్నారు. తక్కువ వడ్డీకి ఇచ్చే రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. పైసా ఖర్చు లేకుండా ఇతర దేశాలలో ఉన్న బంధువుల నుంచి నగదు లావాదేవీలు చేసుకునే అవకాశం ఏపీజీ బ్యాంకుల్లో ఉందన్నారు. పాడి పశువుల పోషణకు కూడా రుణం పొందవచ్చని, డ్వాక్రా మహిళలు ఎటువంటి పూచీ లేకుండా రూ.10 లక్షల వరకు రుణాలు పొందవచ్చని తెలిపారు.డిజిటల్ పేమెంట్స్ అందుబాటులో ఉన్నాయని ప్రస్తుతం ఈ బ్యాంకులో 35 కోట్లు లావాదేవీలు ఉన్నట్లు తెలియజేశారు. ఈ అవకాశాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని వారు కోరారు.కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎం వైష్ణవి, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర –కోవెలకుంట్ల: ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.శివ బాలకృష్ణలు పిలుపు నిచ్చారు. ఈనెల 31వ తేదీన తలపెట్టిన ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేసేందుకు కార్మికులు సంసిద్ధం చేసేందుకు స్థానిక కోవెలకుంట్ల పట్టణంలో ఏర్పాటుచేసిన ఏఐటీయూసీ కోవెలకుంట్ల మండలం కన్వీనర్ అధ్యక్షుడు హసను అధ్యక్షతన నిర్వహించారు.ఈసందర్భంగా శివ,బాలకృష్ణలు మాట్లాడుతూ దేశ స్వాతంత్రానికి ముందు నుండి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు అనేక ఉద్యమాలు జరిపి హక్కులను సాధించడంలో ఏఐటియుసి ప్రధాన పాత్ర పోషించింది అన్నారు కార్మికులకు మెరుగైన జీతాల కోసం రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో అవిశ్రాంత పోరాటాల ద్వారా హక్కులు సాధించిన అమరుల ఆశయాల సాధన కోసం ఈ నెల 31 న తలపెట్టిన ఆవిర్భావ నోత్సవ వేడుకలునియోజకవర్గంలో ఘనంగా నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఏఐటీయూసీ బనగానపల్లె మండల నియోజకవర్గ కార్యదర్శి జీ కుల్లాయి స్వామి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరులకు జోహార్లు

విశాలాంధ్ర –డోన్ రూరల్: పోలీస్ అమర వీరులకు జోహార్లు అని టౌన్ ఎస్ఐ శరత్ కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా గురువారం ఎస్సై పాల్గొన్నారు.

ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పోలీస్ స్టేషన్లోని వివిధ రకాల ఆయుధ సామాగ్రి పట్ల అవగాహన కల్పించారు. ఎటువంటి సమయాలలో ఆయుధాలను ఉపయోగించాలి ఎలా ప్రయోగించాలి అన్న అంశంపై విద్యార్థులకు ఆయుధ వినియోగం, సంఘవిద్రోహుల శక్తుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించడమే కాకుండా, ఆపద సమయాలలో విద్యార్థినులు దిశాయాప్ ను ఎలా ఉపయోగించాలి అన్న అంశంపై పలు విషయాలను వారికి తెలిపారు. విద్యార్థి దశలోనే ఒక ఉన్నత ధ్యేయాన్ని నిర్దేశించుకుని దానికి తగిన విధంగా విద్య ను అభ్యసించి నప్పుడే విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకోగలరని తెలిపారు. పోలీసు సిబ్బంది పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మీరాపురంలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర–బనగానపల్లె: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వారం లాంటిదని ఎంపీడీవో శివరామయ్య, యాగంటి ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి, పేర్కొన్నారు. మీరాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈసందర్భంగా శివరామయ్య మాట్లాడుతూ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.డాక్టర్ శివ శంకరుడు ఆధ్వర్యంలో ఇతర వైద్య సిబ్బంది హాజరై ప్రజలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీహెచ్ నల్లగట్ల వెంకటేశ్వర్లు, రామ్మోహన్‌రెడ్డి, డా. శివశంకర్, గ్రామ సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్ : మండల పరిధిలోని కరివేనలో జగన్నన్న సురక్ష కార్యక్రమం చేపట్టారు. గ్రామ ప్రజలు బిపి, షుగర్, మోకాళ్ల నొప్పులు, జ్వరం లాంటి అనారోగ్యాలు ఉన్నవాళ్లు పాల్గొన్నారు. అక్కడి వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు.

సేవ చేయడం ఓ అదృష్టం

విశాలాంధ్ర–డోన్ : మానవ సేవే మాధవ సేవ అని, సమాజ సేవ చేయడం ఓ అదృష్టమని స్ఫూర్తి సేవాసమితి సభ్యులు మధు అన్నారు. గురువారం సంస్థ ముఖ్య సభ్యుడు, సేవా తత్పరులు కొండపేట హుమాయున్ పుట్టినరోజుని పురస్కరించుకొని సంస్థ ఆధ్వర్యంలో డోన్ ప్రభుత్వ ఆసుపత్రి, వృద్ధాశ్రమాల్లో అన్నదానం చేపట్టి వందలాది మంది ఆకలి తీర్చారు. వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు.

పంట నమోదు జాబితా సరిచూసుకోండి

విశాలాంధ్ర – శిరివెళ్ల : ప్రస్తుత సంవత్సర ఖరీఫ్ సీజన్ లో పంటల సాగు చేసిన రైతన్నల వివరాలు ఆర్ బి కే లలో ప్రదర్శించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రావు ఆదేశించారు. శిరివెళ్ల వ్యసాసాయ అధికారి సుధాకర్ అధ్యక్షతన మహాదేవ పురం గ్రామంలోని ఆర్ బి కే కేంద్రంలో ఈ క్రాప్ బుకింగ్ ముసాయిదాను గురువారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ పంట నమోదు పూర్తి అయిందని నమోదు చేసుకున్న రైతుల జాబితా ఈ నెల 29వ తారీకు వరకు ప్రతి రైతు భరోసా కేంద్రం నందు రైతుల జాబితా ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు జాబితా తనిఖీ చేసుకొని పేరు కానీ ,విస్తీర్ణం కాని,పంట కానీ,నీటి వసతి కాని ఇతర ఏమైన పొరపాట్లు ఉన్నట్లు ఐతే గ్రీవెన్స్ రూపం లో అర్జీ రైతు భరోసా సిబ్బందికి అందించి సరిచేసుకోవాలన్నారు. మహాదేవ పురం లో గ్రామ సభ నిర్వహించి రైతుల పేర్లు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రామ్మోహన్ రెడ్డి సార్, డిపివో ఏ.డి. చెన్నయ్య, టెక్నికల్ ఏ ఓ సర్పంచ్ పెద్ది రమణయ్య రైతులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ తనిఖీ

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : పట్టణంలోని మార్కెట్ యార్డును గురువారం మార్కెట్ యార్డ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించడం జరిగింది. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ రెవిన్యూ పెంచడం, రికార్డులను ప్రాపర్ గా మెయింటైన్ చేయడం ఖాళీగా ఉన్న ప్రభుత్వ గోదాములను ప్రైవేటు వారికైనా బాడుగకు ఇచ్చి ఆదాయం పెంచుకునే చర్యల గురించి అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నారని కార్యదర్శి నారాయణ స్వామిని అభినందించారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ కార్యదర్శి నారాయణస్వామి, సూపర్వైజర్ సురేష్ ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి- సీపీఐ

విశాలాంధ్ర –జూపాడుబంగ్లా: నంద్యాల పట్టణంలో నవంబర్ 17, 18,19 తేదీలలో జరుగు ఎపి మహిళా సమైఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా నాయకులు ఎం రమేష్ బాబు తెలిపారు. గురువారం మండల పరిధిలోని చాబోలులో మహిళాలతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంక్షేమం ఇదేనా అభివృద్ధి లక్ష్యంగా స్వేచ్ఛ సమానత్వం కోసం మహిళల స్థితిగతులలో మార్పు కోసం ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య గత ఎనిమిది దశాబ్దాలకు పైగా పోరాడుతున్నదని అలాంటి ఘన చరిత్ర కలిగిన ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య రాష్ట్ర 15వ మహాసభలకు నంద్యాల వేదిక కానున్నదని ఈ మహాసభలు మూడు రోజులపాటు జరుగుతున్నాయని తెలిపారు. దేశంలో రాష్ట్రంలో మహిళలు,చిన్నారుల మీద దళితుల మైనార్టీల మీద జరుగుతున్న దాడులు వేధింపులు అఘాత్యాలు హత్యలు ఆందోళన కలిగిస్తున్నాయని, అత్యాచారాలు అమ్మాయిలు అక్రమ రవాణా వరకట్న వేధింపులు,బాలికలు విద్యార్థులపై దాడులు విపరీతంగా పెరిగిపోయి మహిళల ఉనికికి ప్రమాదం ఏర్పడిందని వారన్నారు.మహిళలను ఐక్యం చేసి మహిళా హక్కుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఈతరుణంలో జరగబోయే రాష్ట్ర మహాసభలు అందుకు వేదికగా ఉన్నాయని ,అందరూ ఈమహాసభలు జయప్రదం కోసం కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళ సమైక్య నాయకులు లక్ష్మీదేవి, ఉసెన్ బి, ఇమామ్ బి, కళావతి,సువర్ణమ్మ సీపీఐ గ్రామ నాయకులు నడిపి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులు ఆత్మహత్యకు కారకులపై కఠిన చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర – నంద్యాల : మండల పరిధిలోని తుడుములదిన్నెలో అగ్రకుల అహంకారంతో ఉద్దేశ్యపూర్వకంగా దళితుడు శ్రీనివాసులును మానసికంగా హింసించి ఆయన ఆత్మహత్యకు కారకులైన నిందితులు తుడుములదిన్నె గ్రామానికి చెందిన అగ్రకుల పెత్తందారులు పేరెడ్డి మోహన్‌రెడ్డి, కర్నాటి శేఖర్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డిలను పోలీసులు చట్ట పరమైన చర్యలు చేపట్టి వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుడు శివవరం శ్రీనివాసులు మేకలు మేపుకుంటుండగా అదే గ్రామానికి చెందిన నందవరపు గోపాల్‌రెడ్డి అతని తమ్ముడు మధుసూదన్‌రెడ్డి ఇద్దరూ కలిసి శ్రీనివాసులతో వారి పొలం దగ్గర మేకలు మేపుకోవద్దని బెదిరించడం జరిగిందని, శ్రీనివాసులు మేకలు వంకలో మేపుకుంటే మీకు నష్టమేమిటి అన్నందుకు వారు మాదిగ నా కొడకా మాకే ఎదురు చెపుతావా అని శ్రీనివాసులును కర్రతో కొట్టి, కింద పడేసి కాళ్ళతో తన్నడం జరిగిందని, శ్రీనివాసులు భార్య, చుట్టుపక్కల వారు ఈ విషయంపై గోపాల్‌రెడ్డి, మధు సూదన్‌రెడ్డిలపై ఉయ్యాలవాడ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు వారి మీద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.ఇదిభరించలేని గ్రామ పెత్తందారులు పేరెడ్డి మోహన్‌రెడ్డి, కర్నాటి శేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి శనివారం రాత్రి శ్రీనివాసులును, అతని భార్యను మోహన్ రెడ్డి ఇంటి దగ్గరకు పిలిపించుకొని కేసు వాపసు తీసుకోండి లేకుంటే మీరు ఊర్లో ఉండలేరు, మీ అంతు చూస్తామని బెదిరించడంతో వారికి భయపడి మనస్తాపం చెంది ఆదివారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకోవడం విచారకరమని, ఘటనకు కారకులైన వారికి కఠిన శిక్ష పడేలా పోలీస్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

విశాలాంధ్ర– మిడుతూరు: పట్టణ ,గ్రామీణ ప్రాంతాలలో బాల్యవివాహాలు అరికట్టా ల్సిన బాధ్యత అందరిపై ఉందని అంతేకాక మూడు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని ఎంపీడీవో జి .నాగ శేషాచల రెడ్డి పిల్లలతల్లిదండ్రులకు సూచించారు. గురువారం మండల కేంద్రమైన మిడుతూరు రెండవ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలతో వివిధ రకాల వంటలు చేసి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాన్ని తయారుచేసి తల్లులకు వివరించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణ ప్రాంత ప్రజలకు శ్రీరామరక్ష అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే వైయస్సార్ సంపూర్ణ పోషణ పౌష్టికాహారాన్ని గర్భవతులు ,బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాగులు, కొర్రలు, సజ్జలు,అలసందలు, మొక్కజొన్నలు, పెసలు తదితర వాటి ప్రాముఖ్యత గురించి అధికారులకు వివరించారు. పూర్వీకులు పోషకాహారం తీసుకోవడంతో వారు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం అందించే చిరుధాన్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనిమిక్ గర్భవతులు, బాలింతలు, పిల్లలకు వైద్యాధికారులచే పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు అందించారు. వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులు,తది తరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బందు జయప్రదం చేయండి

విశాలాంధ్ర– నందికొట్కూరు : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కడప స్టీల్ ప్లాంట్ సాధన కోసం నవంబర్ 8న తలపెట్టిన రాష్ట్ర విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వామ పక్ష విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి యువజన సంఘాల నాయకులు శ్రీని వాసులు, ఆది, దక్క కుమార్, రంగస్వామి, మరిస్వామి, నవీన్ మాట్లా డుతూ విద్యార్థుల 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కానీ ఇవ్వమని వారన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీ కరణ గురించి పార్ల మెంటు ప్రకటించి చతిస్గడ్ మాత్రం ఉక్కు కర్మా గారం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తామనడం ద్వంద్వైఖరి కాక మరేంటని వారన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. కడపలో ఉక్కు కర్మాగారం సాధన విశాఖ ఉక్కు పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీలు అన్ని వర్గాల వారు మద్దతుకు సహకరించాలని వారు కోరారు.ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మహానంది తాలుక నాయకులు వినోదు దినేష్ ఎస్ ఎఫ్ ఐ మండల నాయుకులు అరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం విస్మరించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర– ఆళ్లగడ్డ : రైతన్నల సంక్షేమాన్ని ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ విస్మరించారని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ విమర్శించారు. గురువారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల పరిస్థితి చూస్తుంటే చాలా బాధాకరంగా ఉందన్నారు. వైయస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ తీరు చూస్తుంటే తెలంగాణకు మేలు చేసే విధంగా ప్రవర్తిస్తున్నట్లుఅర్థమవుతుందన్నారు. మనకు రావాల్సిన ఆస్తులు, మనకు రావాల్సిన నీళ్లు పక్క రాష్ట్రం వాళ్లు తీసుకున్న వైసీపీ ప్రభుత్వం చోద్యం చూస్తున్నదన్నారు. విద్యుత్ ఉత్పత్తి కోసం తెలం గాణలోని రిజర్వాయర్‌లోని నీళ్లను ఖాళీ చేసిన మనవారు నోరు కూడ మెదపకపోవడం బాధాకరమన్నారు. రాజధాని కాదు ముందురాయలసీమకు నీళ్లు ఇవ్వాలని భూమా అఖిలప్రియ డిమాండ్ చేశారు. మనకు రావాల్సిన నీళ్ల విషయంలో మన ప్రాంత వైసిపి ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు మాట్లాడక పోవడం విచారకరమన్నారు. ఐఏబి సమావేశంలో ఆరుతడి పంటలు వేసుకోవాలని చెప్పిన అధికారులు ఆరుతడిపంటలకు సాగునీరు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. కేసీకేనాల్, తెలుగుగంగ కింద సాగునీరు రాక రైతులు ఆందోళన చెందుతుంటే మన ఎమ్మెల్యే ,రాష్ట్ర ప్రభుత్వ సాగునీటి సలహాదారులు ఏమి చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. రైతు సమస్యల పైన ఇంత వరకు ఒక్క సమావేశం కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఎమ్మెల్యే ,మాజీ ఎమ్మెల్సీలు కలెక్టర్‌తో మాట్లాడి ఐదురోజుల్లోగా నీళ్లు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ముఖ్యంగా మీరు కేసీ కెనాల్ వెంట తిరిగి రైతుల పరిస్థితులను గమనించాలని ఆమె కోరారు. మీరు తిరగక , నీళ్లు ఇవ్వకపోతే మాత్రం రైతులు మిమ్మలను క్షమించరన్నారు. తుంగభద్రలో ఉన్న నీటిని విడుదల చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రజలకు పథకాలు ఇస్తే చాలా అభివృద్ధి వద్దా అని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పట్టణంలో టిడ్కో గృహాలను ప్రారంభించారని అయితే కేవలం కొంత మందికి గృహాలు పంపిణీ చేసి బిల్డప్ చేశారని విమర్శించారు.సమావేశంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు సిద్దం రెడ్డి జాఫర్ రెడ్డి, కుందూరు రామిరెడ్డి, ఇంజేదు వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పంట నమోదుతోనే సంక్షేమ పథకాలకు అర్హులు

విశాలాంధ్ర– రుద్రవరం: ప్రతి రైతు తాను సాగుచేసిన పంటల వివరాలను ఆన్లైన్లో తప్పనిసరిగా నమోదు చేసుకుంటేనే అలాంటి రైతులకు వ్యవసాయ శాఖ తరపున అందించే సంక్షేమ పథకాలకు అర్హులవుతారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రావు తెలిపారు. గురువారం మండలంలోని కోటకొండ, ఎల్లావత్తుల చిన్నకంబలూరు, పెద్దకంబలూరు రుద్రవరం, రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ 2023 సంవత్సరం సంబంధించి జిల్లా వ్యసాసాయ అధికారి అధ్యక్షతన ఈ- క్రాప్ సామాజిక తనిఖీ కొరకు ముసాయిదా జాబితా ప్రదర్శించడం జరిగింది.జిల్లా వ్యవసాయ అధికారి మోహన రావు మాట్లాడుతూ ఖరీఫ్ పంట నమోదు పూర్తి అయింది అని పంట నమోదు జరిగిన రైతుల జాబితా ఈనెల 26 నుంచి 29 వరకు ప్రతి రైతు భరోసా కేంద్రంలో రైతుల జాబితా ప్రదర్శించడం జరుగుతుందని ప్రతి రైతు చూసుకొని ఏమైన పేరు కానీ ,విస్తీర్ణం కాని,పంట కానీ,నీటి వసతి కాని ఇతర ఏమైన పొరపాట్లు ఉన్నట్లయితే గ్రీవెన్స్‌రూపంలో అర్జీ అందజేసి రైతు భరోసా సిబ్బందికి తెలియజేసి సరిచేసుకోవాలన్నారు.గ్రామసభలో రైతుల పేర్లు చదివి వినిపించారు.

ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రామ్మోహన్ రెడ్డి ఆఫీస్ ఏ.డి.చెన్నయ్య , టెక్నికల్ ఏ ఓ నాగేంద్రప్రసాద్, మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ విస్తరణ అధికారి రాజు, కార్యదర్శులు షాహినూర్, పాములేటి, కళావతి,గ్రామ సర్పంచులు దేగాని వెంకటేష్, చెన్నప్ప, రైతు భరోసా కేంద్రం సిబ్బందిరైతులు పాల్గొన్నారు.

వైసీపీలో తారస్థాయికి చేరిన విభేదాలు

విశాలాంధ్ర– కొలిమిగుండ్ల : మండలంలోని గోరుమానుపల్లి పంచాయతీ పరిధిలో వైసీపీలో అంతర్గత విభేదాలు తారస్థాయికి చేరాయి. గ్రామ ఆధిపత్యం కోసం ఆపార్టీ నాయకులు మధ్య విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. ఎంపీటీసీ పులి ప్రకాష్‌రెడ్డి, నాయకులు జగన్ వర్గాలుగా విడిపోవడంతో వైకాపాలో అయోమయం ఏర్పడ్డది. పంచాయతీ పరిధిలోని గోరుమానిపల్లి, కొండమీదపల్లి గ్రామాల్లో రెండు రోజుల పాటు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమము చేపట్టేలా నిర్ణయించి బుధవారం కార్యక్రమాన్ని నిర్వహిస్తే ఎంపీటీసీ పులిప్రకాశ్‌రెడ్డి వర్గం కనపడలేదు. ముఖ్య అతిథులుగా కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొన్న ఎంపీటీసీ గ్రామంలో ఉన్న హాజరు కాలేదు. విభేదాల కారణంగానే రెండోరోజు నిర్వహించాల్సిన కార్యక్రమం వాయిదా పడిందని పలువురు భావిస్తున్నారు. నాయకుల మధ్య ఆయా గ్రామాల్లో ఎన్ని విభేదాలున్న తమ గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమానికి మాత్రం తప్పకుండా హాజరయ్యేవారు. కావాలని తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా అణిచివేస్తున్నారని పులి భావిస్తుండగా, అధికార పార్టీకి చెంది రెండుసార్లు ఎంపీటీసీ అయిన మండల సమావేశంలో ప్రోటోకాల్‌పై ఓఅధికారితో విభేదించి, మన స్థాపం చెంది ఆ తర్వాత కొన్ని మండల సమావేశాలకు గైర్హాజరు అయి ఎంపీటీసీ పదవిని పులి వదులుకోవడానికి గతంలో సిద్ధమయ్యారు. టీడీపీ మండల అధ్యక్షుని సొంత గ్రామం కావడంతో కూడ సహజంగా గ్రామంపై అందరి దృష్టి పడ్డది. ఎన్నికల దృష్ట్యా విభేదాలు వీడితేనే వైసీపీకి మెజార్టీ దక్కే అవకాశాలు ఉన్నాయి.

మహాసభలు విజయవంతం చేయండి

విశాలాంధ్ర–బనగానపల్లె: ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు నంద్యాలపట్టణంలో నవంబర్ 17,18,19 తేదీలో జరుగనున్న దృష్ట్యా విజయవంతం చేయండిని నంద్యాల జిల్లా ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివ బాలకృష్ణ పిలుపునిచ్చారు. బనగానపల్లిలో ఏఐటీయూసీ కార్యాలయంలో నియోజకవర్గ జి.కులాయి స్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐటియుసి నంద్యాల ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివ బాలకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, సమాజంలో రాజకీయ వేధింపులు లేకుండ మహిళలను సమానంగా చూడాలని మహిళలు అభివృద్ధి చెందుతూనే మహిళ సాధికారత సాధ్యమవుతుందని అని పేర్కొన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు సంజీవులు , సుబ్బయ్య, వెంకటలక్ష్మి ,తిరుపాలమ్మ ,ఉమాదేవి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

విశాలాంధ్ర– నందికొట్కూరు: ముఖ్యమంత్రి ఆరోగ్య సహాయ నిధి పేదల పాలిట వరం లాంటిదని ఎమ్మెల్యే ఆర్థర్ అన్నారు. నందికొట్కూరులోని ఎమ్మెల్యే కార్యా లయంలోగురువారం నియోజక వర్గం పరిధిలోని నెహ్రూ నగర్ గ్రామానికి చెందిన కట్టుబడి లక్ష్మీదేవి భర్త కట్టుబడి బాబు వైద్య ఖర్చుల ఆర్థిక సహాయం నిమిత్తం వచ్చినటువంటి చెక్కును ఎమ్మెల్యే ఆర్థర్ ఆ గ్రామ వైఎస్ఆర్ సీపీ నాయకులు శ్రీనాథ్ రెడ్డితో కలిసి వారికి అందజేయడం జరిగింది. వైసీపీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు సగినేల వెంకటరమణ, కౌన్సిలర్ ధర్మారెడ్డి, జీవన్ సుందరాజు, విశ్రాంత పోలీసు అధికారి జాన్, అయ్యన్న, శంకరయ్య, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర –ఆత్మకూరు టౌన్: పట్టణానికి చెందిన శిల్పన్న భక్తుడైన వైసీపీ అభిమాని, నవాబు తండ్రి అయిన షేక్ అబ్దుల్ రజాక్ ఇటీవల అనారోగ్య కారణంగా గుండెకు సంబంధించిన సమస్యకు చికిత్స పొందారు. విషయం తెలుసుకొని గురువారం వారి స్వగృహానికి వెళ్లి మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ రషీద్, మున్సిపల్ కౌన్సిలర్లు రెహమాన్, షఫీఉల్లా, రఫీ, కుద్దుస్, సలాం పరామర్శించారు.

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ ట్రాప్

రూ.5వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ జూనియర్ అసిస్టెంట్

విశాలాంధ్ర –నంద్యాల: జిల్లా కేంద్రంలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌నుఏసీబీ అధికారులు ట్రాప్ చేసి పట్టుకున్నారు. రుద్రవరం మండలం ఆలమూరు గ్రామం చిత్తరేనిపల్లికి చెందిన రైతు బరిగెల చిన్నప్ప తనకు చెందిన మూడెకరాల పొలం ఆన్‌లైన్‌లో చుక్కల భూమిగా ఉండటంతో చుక్కల భూమి తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు స్పందనలో కోరగా కలెక్టర్ చుక్కల భూమి తొలగించాలని ఆదేశాలిచ్చారు. కానీ ఆభూమి చుక్కల భూమి నుంచి తొలగిచడానికి తనకు రూ.30 వేలు ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేయగా అంత లంచం ఇచ్చుకోలేని రైతు చెన్నప్ప ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం రూ.5 వేలు కార్యాలయంలో పనిచేసే డ్రైవర్ ద్వారా కిరణ్ కుమార్ రెడ్డికి అందజేశాడు. ఏసీబీ డీయస్పీ వెంకటాద్రి అధ్వర్యంలో పక్కా పథకం ప్రకారం రైతు చెన్నప్ప నుంచి ఐదువేలు తీసుకుంటుండగా డ్రైవర్ ప్రకాష్ రెడ్డిని, జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్‌రెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ వెంకటాద్రి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 14400కు ఫోన్ చేసి తెలపాలని, తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో డిఎస్పీతో పాటు సిఐ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బరాయుడికి వెండి పడిగే విరాళం

పాణ్యం–విశాలాంధ్ర: ప్రముఖ సేవ క్షేత్రం మండల పరిధిలోని ఎస్. కొత్తూరులో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి భక్తులు వెండి నాగ పడిగే గురువారం వితరణ చేసినట్లు ఆలయ ఈఓ రామకృష్ణ తెలిపారు. బనగానపల్లెలకు చెందిన జక్క సుబ్రహ్మణ్యం కుమారుడు జక్క అభిరామ్ వారి కుటుంబ సభ్యులు స్వామి వారు ఇంటి ఇలవేల్పు కావడంతో మొక్కుబడిగా ఒక కేజీ 30 గ్రాముల వెండి నాగ పడిగే వితరణగా ఇచ్చారన్నారు. ఆలయ అభివృద్ధికి రేవనూరుకు చెందిన మల్లు ఆదినారాయణ రెడ్డి,లావణ్య,కార్తికేయ రెడ్డి,ఉదయకుమార్ రూ.84,500లు ఆలయ ప్రధాన అర్చకులు నారాయణ స్వామికి అందజేశారు.దాతలకు ఆలయ మర్యాదలతో స్వామివారికి అభిషేకం,అర్చనలు,విశేష పూజలు నిర్వహించి ప్రసాదములు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు సరి చూసుకోండి

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్-2023 పంట వివ రాలను సోషియల్ ఆడిట్ కొరకు ప్రదర్శించడం జరిగిందని, రైతులు గమనించి తమ పంట వివరములు సరిగా ఉన్నాయో లేదో తెలుసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు అన్నారు. మండలంలోని పేరాయి పల్లె, జి. జంబులదిన్నె గ్రామాలలో జొన్న, మినుము పంటలను పరిశీలించి పంటల స్థితిగతులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సోషల్ ఆడిట్ జరిపించాలని ఆదేశించారు. వారి వెంట నంద్యాల ఏడీఏ చెన్నయ్య, ఏవో కిషోర్ కుమార్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి హుస్సేన్ బాషా, వీఏఏలు షాహిన్, హరినాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డోన్ రూరల్: పంటనమోదులో ఏవైనా తప్పులుంటే సరిచేసుకోండని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫీ అన్నారు. మండలంలోని వెంకటాపురం సర్పంచ్ బోయ రాణి అధ్యక్షతన పంట నమోదు సామాజిక జాబితా ప్రదర్శించారు. గ్రామసభ నిర్వహించి రైతుల పేర్లు,వేసిన పంట, విస్తీర్ణం,విత్తిన తేదీ,నీటి ఆధారంగా రైతులు ఎటువంటి పంటలు వేసినది తెలియజేశామన్నారు.ప్రతి రైతు రైతుభరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కొరకు ఈ నెల 29 వరకు జాబితా ప్రదర్శించడం జరుగుతుందని ఏవైనా తప్పులు ఉంటే రాత పూర్వకంగా గ్రామ వ్యవసాయ సహాయకులకు అర్జీ పెట్టుకొని పంట పరిశీలినలో తప్పులను సరిచేసుకొనుటకు చివరి అవకాశమని తెలిపారు.

ప్రభుత్వం వ్యవసాయ కార్మికులను గుర్తించాలి

విశాలాంధ్ర – కోడుమూరు : రాష్ట్రంలోని వ్యవసాయ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, వారికి గుర్తింపు కార్డులిచ్చి, కరువు సహాయక చర్యల్లో భాగంగా ఆర్థికంగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బికెయంయు అనుబంధమైన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు వెంకటగిరి సచివాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దెత్తున నినాదాలు చేశారు. ఈసందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి రాజు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శేషకుమార్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు కరాళ నృత్యం చేస్తుందన్నారు. జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలన్నారు. వర్షాలు లేక పంటలు ఎండిపోయి రైతుల బతుకులు దీనంగా మారినప్పటికి ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోవడంలేదని విమర్శించారు. పొలాల్లో పెట్టిన పెట్టుబడులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలన్నారు. బ్యాంకుల్లో పాత రుణాలను రద్దుచేసి కొత్త రుణాలను అందజేయాలన్నారు. వ్యవసాయ కార్మికులకు నెలకి 35 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను ఉచితంగా ఇవ్వాలన్నారు. నెలకు రూ.10వేలు కరువుబత్యం, ఉపాధి హామి పథకం పనులు వెంటనే చేపట్టి వలసలు అపాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయం సహాయ కార్యదర్శి అనితకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిస్వామి, నాగరాజు, అలీసా, మహబూబ్ భాష, మధు, గోపాల్ నాయుడు, రామగిడ్డయ్య, రామాంజనేయులు, ఏఐటీయూసీ చిన్నరాముడులు పాల్గొన్నారు.

8న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతం చేద్దాం

కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు.. విశాఖఉక్కు పరిరక్షణకు విద్యార్థి యువజన సంఘాల పిలుపు

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు : కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, విశాఖఉక్కు పరిరక్షణ కోసం 8న చేపట్టనున్న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని విద్యార్థి యువజన నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీరాములు గౌడ్,పీ.డీ.ఎస్.యూ.జిల్లా కార్యదర్శి బి.మహేంద్ర బాబు,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర,ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్,డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సురేష్,ఏఐఎస్ఏ,పీడీఎస్ఓ తాలూకా నాయకులు రాజు, సురేంద్రబాబులు మాట్లాడుతూ అనేకత్యాగాలతో విద్యార్థి యువజన నాయకుల 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ చేపట్టిన పోరాటం నవంబర్ 8 నాటికి వెయ్యి రోజులుకు చేరుకుంటుంది. వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనడంతో పాటు 8న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలబంద్‌కి పిలుపునిచ్చారు. లాభాలు వస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈఫ్యాక్టరీ అనుబంధంగా ఇనుము గనులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రత్యక్ష, పరోక్షంగా లక్షలాది మందికి ఉపయోగపడుతున్న విశాఖఉక్కును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. విశాఖఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ పోరాడిన అమరవీరుల త్యాగాలు స్ఫూర్తితో విశాఖఉక్కు పరిరక్షణ కోసం అన్నివర్గాల ప్రజలు ఐక్యం చేస్తామన్నారు. కడపఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని విభజన చట్టంలో పేర్కొన్న హామీ ఇంతవరకు ఏమాత్రం అమలు చేయలేదని తెలిపారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అయితే లక్షలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు.కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధికి నిధులు ఇవ్వకపోయినా నూతన పరిశ్రమలు ఏర్పాటు వంటి విభజన హామీలు అన్నిటిపై నిర్లక్ష్యం చేస్తూ రాష్ట్రంలోని బిజెపి నేతలు మోడీని ఎందుకు అడగడం లేదని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ పెద్దలు నిద్ర నటిస్తున్నారని రాష్ట్ర ప్రయోజనాల కంటే ముఖ్యమంత్రికి వ్యక్తిగత ప్రయోజనాలు ఎక్కువ అయ్యాయని ఆరోపించారు. కేసులభయంతో మోడీ ముందు మోకరిల్లుతున్నారని భయపెట్టారు రాష్ట్ర విభజన హామీలలో ప్రధానమైన కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం కేంద్రం ఒక్కపైసా కూడా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం రెండు సార్లు శంకుస్థాపన చేసిన ఆచరణలో పురోగతి లేదన్నారు.పాలక ప్రభుత్వాలు సంయుక్తంగా ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటు చేసి స్థానిక యువతికి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నవంబర్ 8 వరకు జిల్లాలోని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు పత్రిక సమావేశాలు సదస్సులు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు నవంబర్ 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా కేజీ టు పేజీ వరకు జరిగే విద్యాసంస్థల బంద్‌కు ప్రతిఒక్కరూ మద్దతు తెలిపే సహకరించాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో విద్యార్థి, యువజనసంఘాల నాయకులు విజేంద్ర, రంగస్వామి,మునిస్వామి,రామకృష్ణ, నరసింహరెడ్డి, విజయ్, ఖాదర్, సమీర్, రామకోటి, చక్రి, రవి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయండి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: భారతదేశ సంఘటిత అసంఘటిత కార్మికుల కోసం ఆవిర్భవించిన మొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవం అక్టోబర్ 31న విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మునెప్ప కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం కర్నూలు ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో నగర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నగర అధ్యక్షులు బి.వెంకటేష్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మునెప్ప మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం, శ్రమదోపిడీ లేని కార్మిక రాజ్యం సాధించాలనే లక్ష్యంతో 1920 అక్టోబర్ 31న ముంబై వేదికగా ఏఐటీయూసీ ఆవిర్భవించిందన్నారు. కార్మికులకు శ్రమకు తగ్గే వేతనం చెల్లించాలని కార్మిక హక్కుల కోసం ఏర్పడిన సంఘం ఏఐటీయూసీ నేనన్నారు. స్వాతంత్ర్య అనంతరం పాలక ప్రభుత్వ అవలంబిస్తున్న కార్మిక ఉద్యోగ హక్కుల కొరకు అనేక పోరాటాలు చేసి 44 కార్మిక చట్టాలు సాధించడంలో ఆదిత్యమైన పాత్ర కలిగిన సంఘం ఏఐటీయూసీగా ఖ్యాతి గడించిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను తుంగలో తొక్కి యజమానుల కనుకూలంగా పార్లమెంటులో చట్టం తెచ్చి 44 కార్మికుల చట్టాలను నాలుగు కోళ్లుగా విభజించి కార్మికులకు పూర్తి అన్యాయం చేసిందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక దేశ సంపదను మొత్తం అంబానీ, ఆదానిలకు దోచిపెడుతున్నారని, రానున్న ఎన్నికల్లో కార్మికులను కలుపుకొని బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడానికి పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.సి. రహమాన్, నల్లన్న, రేణుక, కృష్ణ,బతుకమ్మ, హోటల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పురుషోత్తం, రామాంజనేయులు, ఆనంద్,నాగేంద్ర, రంగ నాయకులు, రామకృష్ణ, మృతుజావలి, నరసింహ, హమాలీ సంఘం నాయకులు వెంకటేష్, శీను, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణారెడ్డి, రాము, సాములు, బీసన్న, శాలు పాల్గొన్నారు.

పనిచేయని ఆధార్ కేంద్రాలు.. ఇబ్బందుల్లో ప్రజలు

విశాలాంధ్ర- హెరాలగుండ : మండలంలోని ఆధార్ క్యాంప్ శిబిరాలు పనిచేయక ప్రజలు తీవ్రఇబ్బంది పడ్డారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, కొత్తకార్డు నమోదు, ఇతర సమస్యల పరిష్కరించుకోవడానికి ప్రజలు ఆదోని, ఆలూరు, గుంతకల్ ప్రాంతాలకు వెళ్లి పరిష్కరించుకోవాల్సిన దుస్థితి నెలకొనడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారులు ఆధార్ కేంద్రాలు ప్రారంభిస్తారంటూ ప్రజలు సచివాలయం కార్యాలయం వచ్చి నేను తిరిగివెళ్లారు. అందుబాటులో ఆదివారం కేంద్రాలు పనిచేస్తే ఆర్థికకష్టాలు ఇతర ఇబ్బందులు తగ్గుతాయని ప్రజలు పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఆధార్ కేంద్రాలు పనిచేయక ప్రజలకు ఆధార్ కష్టాలు తీరలేక పోయాయని ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, జడ్పీ సీఈవో చర్యలు తీసుకుని ఆధార్ కేంద్రాలు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు. ఎంపీడీవో సుహాసినిను సంప్రదించగా మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష జరుగుతోందని,డిజిటల్ అసిస్టెంట్ల కొరతతో వాటిని ప్రారంభించలేదన్నారు. సురక్ష ముగిసిన తర్వాతే ప్రారంభిస్తామని తెలిపారు.

రాష్ట్రంలో సామాన్యుడు బతికే పరిస్థితి లేదు

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: ఎన్నడూ లేని విధంగా నిత్యవసరాల వస్తువుల ధరలు,పన్నుల భారం,వర్షాలు లేక పంటలు ఎండిపోవడం, నిరుద్యోగులకు ఉపాధి లేక పోవడం, నకలీ మద్యంతో ప్రాణాలు పోవడం, ఇసుక దందా పెరగడంతో సామాన్యులు బ్రతికే పరిస్థితి లేదని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు.వైసీపీ పాలనలో బ్రతుకు లేదు ఉరే గతి అంటూ గురువారం కర్నూలు నియోజకవర్గం పార్టీ ఇన్చార్జి టీ.జి. భరత్, నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్‌ల ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయం ఎదుట పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉరి వేసుకుంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక పక్క స్వయానా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇసుక మాఫియా నడిపిస్తూ వేల కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారన్నారు. మరోపక్క లిక్కర్ మాఫియా డబ్బు మొత్తం జగన్ ఇంటికి చేరుతుందని విమర్శించారు. ఆర్థిక నేరాలు చేసి జైలు జీవితం గడిపిన వారు పదేళ్లుగా బయట తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం ఆలోచించే ప్రజానాయకుడు చంద్రబాబును అరెస్టు చేసి జైల్లో పెట్టడం, ఎలాంటి నేర నిరూపణ కాకుండా కేవలం రాజకీయ కక్షతో జ్యాడీషియల్ రిమాండ్ లో ఉంచడం ఎంత వరకు సమంజసమని వారు సూటిగా ప్రశ్నించారు. 2024 ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, అధర్మ ప్రభుత్వాని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.బాబు అరెస్టును జీర్ణించులేక గుండెపగిలి మరణించిన పార్టీ కార్యకర్తలను భువనేశ్వరి పరమార్శిస్తున్నారని, జిల్లాలో మరణించిన కార్యకర్తలను కూడా భువనేశ్వరి పరమార్శిస్తారని తెలిపారు.

విశాలాంధ్ర- కర్నూలు లీగల్ : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఉపసంహ రించుకోవాలని, కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 8 వ తేదీన జరిగే కేజీ నుండి పీజీ వరకు విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. శరత్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు కె.రమణ,ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి యం.బీసన్నలు పిలుపు నిచ్చారు. గురువారం ఓర్వకల్లులో ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ,ఏఐవైఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోని బీజేపీ ప్రభుత్వం ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణకు పూనుకోవడం సరికాదన్నారు. 32 మంది ఆంధ్రుల ప్రాణ త్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కారు చౌకగా కార్పొరేట్లకు అమ్మేస్తూ, ఆంధ్ర రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. 8న జరిగే బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ అన్ని రాజకీయ పార్టీలు,విద్యార్థి,యువజన, ప్రజాసంఘాలతో త్వరలోనే ఓర్వకల్లులో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు జయకృష్ణ, గోవర్ధన్, పీడీఎస్ యూ నాయకులు పురుషోత్తం, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు బాబయ్య,సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ఐఎస్ఎఫ్.. పీడీఎస్‌యూ..ఏఐవైఎఫ్‌లు పిలుపు

పత్తికొండ: నవంబర్ 8న విద్యాసంస్థల బంద్ చేపడుతున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లాఉపాధ్యక్షులు అల్తాఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచిలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక చదువుల రామయ్య భవనంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డిలు అధికారంలోకి రాకముందు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులన్నింటినీ భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను మోసం చేయడం తగునా అని సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, విశాఖఉక్కును ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కేజీ నుండి పీజీ వరకు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి యువజన సంఘాలు తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌కు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు నజీర్, పట్టణ అధ్యక్ష ,కార్యదర్శులు వినోద్, రమేష్, ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు పెద్దయ్య, నాయకులు ఉపేంద్ర, చిరంజీవి, పవన్, అహ్మద్, అభిషేక్, లక్ష్మణ్, భాష తదితరులు పాల్గొన్నారు.

బన్ని ఉత్సవ మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

రూ.25 లక్షలు ఆర్థిక సహాయం అందించాలి సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

విశాలాంధ్ర- ఆలూరు : దసరా పండుగ సందర్భంగా దేవరగట్టు బన్నీ ఉత్సవంలో మృతి చెందిన గణేష్ (17), ప్రకాష్ (30), రామాంజనేయులు(59) మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరగట్టు బన్నీ ఉత్సవంలో ఆనాగరికముగా సంప్రదాయబద్ధంగా జరిగే క్రీడలో హింసను తగ్గించే విషయంలో ప్రభుత్వ జిల్లా ఉన్నతాధికారులు, ఆలయ నిర్వాహకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఈఉత్సవంలో ముగ్గురు మరణించడం అత్యంత బాధాకరమన్నారు. గత 15 ఏళ్లుగా ఎప్పుడు ఇంత హింస చోటు చేసుకోలేదన్నారు. ముగ్గురు వ్యక్తులు మృతి చెందడమే కాకుండా వందలాది మందికి తలలు పగిలి తీవ్రంగా గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు, దేవాలయ కమిటీ వారు ఘోరంగా వైఫల్య కారణంగానే ఎంతో భవిష్యత్తు ఉన్న ముగ్గురు చనిపోవడంతో వారి కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయన్నారు. తక్షణమే ప్రభుత్వం చనిపోయిన మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని, వైఫల్యం చెందిన దేవాలయ కమిటీ నిర్వాహకులపై చట్టపరంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో దేవరగట్టు ఉత్సవాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటి శెట్టి, మండలకార్యదర్శి రామాంజనేయులు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు భూపేష్, హెూతురప్ప, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రంగన్న, రైతు సంఘం తాలూకా నాయకులు చంద్రకాంత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఎనగండ్లలో కార్డెన్‌సర్చ్ ఆపరేషన్

విశాలాంధ్ర–సి.బెలగల్ : మండల పరిధిలోని యనగండ్ల గ్రామంలో కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గురువారం త్వరలో జరగబోయే తెలంగాణ శాసనసభ ఎన్నికల దృష్ట్యా తెలంగాణ రాష్ట్రానికి సమీప గ్రామమైన ఎనగండ్ల గ్రామంలో కోడుమూరు సీఐ,సి.బెళగల్ ఎస్సై వారి ఆధ్వర్యంలో గూడూరు పోలీసులు మరియు సి.బెళగల్ పోలీసు సిబ్బంది అందరూ కలిసి ఎనగండ్ల గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. కోడుమూరు సీఐ మనసూరుద్దీన్, సి.బెలగల్ ఎస్సై ఏసీ పీరయ్య పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ యంత్రాల తనిఖీలు గడువులోగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: కేంద్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియను నవంబర్ 10 లోపు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని ఈవీఎం గోడౌన్‌లో జరుగుతున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలను విడి విడిగా భద్రపరచాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. అనంతరం విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకప్ నోడల్ అధికారి మరియు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర- పెద్దకడబూరు : మండల కేంద్రమైన పెద్దకడబూరుకు చెందిన సాలె నాగరాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న 1986-91 జడ్పి ఉన్నత పాఠశాలలో నాగరాజుతో కలిసి చదివిన స్నేహితులు గజేంద్రరెడ్డి, గురుస్వామి, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, నర్సింహులు, మల్లికార్జున, నరసన్న, శ్రీనివాసులు, వెంకటరాముడు మరికొంత మంది చేయిచేయి కలిపి రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. స్నేహితుని కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని కుటుంబానికి భరోసా ఇచ్చారు.

ముస్లింలకు ఇచ్చిన మాట నెరవేర్చా

విశాలాంధ్ర- పెద్దకడబూరు: ముస్లింలకు షాదీఖానా పూర్తి చేయిస్తానని ఇచ్చిన మాట నెరవేర్చానని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన పెద్దకడబూరులో ముఖ్యమంత్రి అభివృద్ధి నిధులు కింద నిర్మించిన షాదీఖానా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమకు పెళ్లిళ్లు జరుపుకోవడానికి చాలా ఇబ్బందిగా ఉందని ముస్లింలు తన దృష్టికి తెచ్చారని గుర్తు చేశారు. దీంతో పూర్తి చేయిస్తానని మాట ఇచ్చినట్లు తెలిపారు. 20 ఏళ్లుగా పెండింగ్‌లోని షాదీఖానాకు సీఎండిఎఫ్ నిధులు రూ.35 లక్షలు మంజూరు చేయించి నిర్మాణం పూర్తి చేసి ముస్లింలకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైసీపీ ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు.

దుబ్బన్న కుటుంబాన్ని పరామర్శ

విశాలాంధ్ర–సి.బెళగల్: ఇటీవల చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిజైల్లో పెట్టారనే దిగులుతో మృతి చెందిన కుటుంబాన్ని టిడిపి మండల కన్వీనర్ గోవింద్ గౌడ్ టిడిపి నాయకులతో కలిసి గురువారం పెమర దుబ్బన్న కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాబు అరెస్టు అక్రమమని త్వరలో కడిగిన ముత్యంలా బయటకు వస్తారని చంద్రబాబు అరెస్టుతో కలత చెంది మృతి చెందిన కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని టిడిపి మండల కన్వీనర్ గోవింద్ గౌడ్ అన్నారు. అలాగే పెద్దదిక్కు కోల్పోయిన కుటుంబాలను ఆదుకునేందుకు టిడిపి నాయకురాలు చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఓదార్పు కార్యక్రమం చేపట్టనుందని పార్టీని నమ్ముకున్న వారికి టిడిపి అండగా ఉంటుందని గోవింద గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో గోవింద గౌడ్ తో పాటు పెద్ద మునెప్ప, సి.బెళగల్ ఎంపీటీసీ రవి, బుడ్డన్న, మాజీ మండల కన్వీనర్ పాండురంగన గౌడ్, చిన్న మునెప్ప, గిడ్డయ్య గౌడ్, మద్దిలేటి తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇప్పుడే ఇలా అయితే ఎలా.. వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవా...!

అడుగంటిన కాజీపురం జలాశయం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచు

విశాలాంధ్ర - చిప్పగిరి: వర్ష కాలంలోనే పది రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తే మరి వేసవికాల పరిస్థితి ఏమిటని.. మండల కేంద్రమైన చిప్పగిరితో పాటు మండల పరిధిలోని కుందనగుర్తి, దౌల్తాపురం గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాజీపురం జలాశయం నుండి చిప్పగిరి, కుందనగుర్తి, దౌల్తాపురం, గ్రామాలతో పాటు బంటనహాల్, గుమ్మనూరులకు తాగునీరు సరఫరా చేయడం జరుగుతుంది. కాజీపురం రిజర్వాయర్‌కి తుంగభద్ర జలాశయం నుండి హై లెవెల్ కెనాల్ ద్వారా కాజీపురం జలాశయం పూర్తి నీటి సామర్థ్యంతో నింపాల్సి ఉంది. అయితే హై లెవెల్ కెనాల్‌పైన ఉన్న రైతులు అక్రమ డీజిల్ మోటర్లు అమర్చుకొని జల చౌర్యంకు పాల్పడుతుంటే సాగు, తాగు నీరు ముందుకు రావడం లేదన్నారు. దీంతో జలాశయంలో నీరు అడగంటి పోవడంతో, పది రోజులకు ఒకసారి తాగు నీరు గ్రామాల్లో సరఫరా చేస్తే గ్రామ ప్రజల పరిస్థితి ఏమిటన్నారు. వర్షాకాలం లోనే ఇలా ఉంటే ఎండాకాలంలో తాగునీటి పరిస్థితి తీవ్ర రూపం దాల్చే పరిస్థితి ఏర్పడుతుందని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారుల అలసత్వం వల్లే కాజీపురం రిజర్వాయర్‌ను పూర్తి నీటి సామర్థ్యంతో నింప లేకపోయారని, తుంగభద్ర జలా శయ ఇరిగేషన్ అధికారులు నవంబర్ 15న హై లెవెల్ కెనాల్ కు సాగు తాగునీరు నిలుపుదల చేయడం జరుగుతుందని చెప్పడంతో ఏమి చేయాలో తెలియని దుస్థితిలో గ్రామాల ప్రజలు ఉండిపోయారు. దీంతో చిప్పగిరి సర్పంచ్ దాసరి గోవిందరాజులు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ప్రజలు మండల అభివృద్ధి అధికారి కొండయ్యకు సకాలంలో కాజీపురం జలాశయంలో పూర్తి సామర్థ్యంతో నీటిని నింపి వేసవికాలంలో మంచినీటి సమస్య తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎంపీడీవో కొండయ్య కాజీపురం జలాశయాన్ని సందర్శించి పరిశీలించారు. వేసవికాలంలో మంచినీటి సమస్య తలెత్తకుండా జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి కాజీపురం జలాశయం పూర్తిస్థాయిలో నీటిని నింపేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వారికి హామీ ఇచ్చారు.

మూతబడిన శుద్ధజల కేంద్రం..ఇబ్బందుల్లో ప్రజలు

విశాలాంధ్ర- హెరాలగుండ : హెరాలగుండ ప్రజలకు అతి తక్కువ ధరకు స్వచ్ఛమైన నీరు అందించడానికి అధికారులు వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు పంచాయతీ పరిధిలో ఉన్న వాటర్ ప్లాంట్‌ను వేలం ద్వారా వాటర్ ప్లాంట్ నడపడానికి కాంట్రాక్టర్కు పంచాయతీ అధికారులు అప్పగించారు వాటర్ ప్లాంట్ లోని స్వచ్ఛమైన నీటిని ప్రజలు అతి తక్కువ ధరకే పొందేవారు అయితే వాటర్ ప్లాంట్ మూతపడడంతో ప్రజలు స్వచ్ఛమైన తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ వాటర్ ప్లాంట్లలో అధిక ధరలు చెల్లించి స్వచ్ఛమైన తాగు నీటిని తీసుకువెళుతున్నామని ప్రజలు తెలిపారు. ప్రైవేట్ వాటర్ ప్లాంట్లలోని నీటిని తాగితే కండ్లు మండుతున్నాయని, నాలుక, నోరు దురదగా ఉంటుందని ప్రజలు ఆరోపించారు.ప్రజలకు విజయదశమి పెద్దపండుగ అయినప్పటికీ స్వచ్ఛమైన తాగునీరు కరువయ్యాయని ప్రజాసంఘాల నాయకులు వాపోయారు. వాటర్ ప్లాంట్ మూతపడటం వల్ల ప్రైవేట్ వాటర్ ప్లాట్ కు గిరాకీ పెరిగింది. ప్రైవేట్ ప్లాంట్ల వద్ద పడి కాపులు కాస్తూ నీటిని తీసుకువస్తున్నామని ప్రజలు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని వాటర్ ప్లాంట్ తెరిసేలా చూడాలనీ ప్రజలు విజ్ఞప్తి చేశారు. గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్‌ను వివరణ కోరగా వాటర్ ప్లాంట్ నడిపే కాంట్రాక్టర్ అనారోగ్య కారణంగా వాటర్ ప్లాంట్ మూతపడిందని, వారంలో వాటర్ ప్లాంట్ తెరవడానికి చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లాలని సర్పంచుతో చర్చించడం జరిగిందని రాజశేఖర్ గౌడ్ వివరించారు.

వలసల నివారణకు ఉపాధి హామీ పనులు కల్పించాలి

విశాలాంధ్ర- పత్తికొండ: వలసలను నివారించి ఉపాధి హామీ పనులను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నబి రసూల్ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గురువారం పత్తికొండ మండల పరిధిలోని చిన్నహుల్తి సచివాలయంలో వ్య.కా.స. నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సరైన వర్షాలు కురవక రైతులు సాగుచేసిన ప్రధాన పంటలన్నీ ఎండిపోయి తీవ్రంగా నష్టపోవడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు లేక రైతులు, వ్యవసాయ కూలీలు సుదూర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారని, వలసలను నివారించి, ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచి కనీస వేతనం రోజుకి రూ.600 లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు పేద కుటుంబాలకి కరువు పెన్షన్ రూ.10 వేలు ఇచ్చి,నెలకు 35 కేజీల బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, ఏపీ రైతు సంఘం తాలూకా కార్యదర్శి కారన్న, నాయకులు నరసింహులు, ఉరుకుందు, రాజప్ప, నరసప్ప, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

కూలీలను ఆదుకోవాలంటూ సచివాలయం ముందు ధర్నా

విశాలాంధ్ర –ఆలూరు : తీవ్ర కరువు పరిస్థితుల నేపథ్యంలో ఏలాంటి పనులు లేక వ్యవసాయ కూలీలు సుదూర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారని తక్షణమే వ్యవసాయ కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సచివాలయ కేంద్రాల వద్ద వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి, తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షభావ పరిస్థితిల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పంటలు వేసి నష్టపోయిన పోయిన రైతులకు ఎకరాకు రూ.40 వేలు పంట నష్ట పరిహారాన్ని ప్రకటించి, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వంద రోజులు పనిదినాలు అదనంగా పొడగించాలని డిమాండ్ చేశారు. ఆయా సచివాలయాల కేంద్రాలలోనే పంచాయితీ కార్యదర్శులకు వినతి పత్రాలను అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రంగన్న, ఏఐవైఎఫ్ నాయకులు మునిస్వామి, ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షులు శివ, చాపల గోపాల్, గోవిందు, పట్టణ కోరమాండల్ శాఖ అధ్యక్షులు నరసింహ, సిద్దేశ్వర కాలనీ శాఖ కార్యదర్శి పాండు, ఓబులేసు, గోపాలు, బాలు, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

KURNOOL MUNICIPAL CORPORATION

e-Procurement Notice

Tender Notice No.6-1 to 6-20 /GGMP / EE&SE /Knl/23-24, dt.17-10-2023

Name of the Scheme	Gadapa Gadapaku Mana prabhuthvam
No of works	20
Bid document download starting date	27/10/2023 at 5:30 P.M
Bid document download end date	17/11/2023 at 4:00 P.M
Last Date & Time for receipt of Bids	17/11/2023 at 5:00 P.M
Commercial Bid Opening Date	17/11/2023 at 5:30 P.M

Further details can be seen @ e procurement market place at www.tender.apeprocurement.gov.in For Contact 9849908497, 9849908470

Sd/-A.Bhargav Teja, I.A.S., Commissioner, Kurnool Municipal Corporation, Kurnool.